మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

హత్నూర, న్యూస్‌టుడే: నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని హత్నూర, నర్సాపూర్, చిలప్‌చెడ్, కౌడిపల్లి, కొల్చారం, శివ్వంపేట, వెల్దుర్తి, మాసాయిపేట, పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని జిన్నారం, గుమ్మడిదల మండలాలకు ఆదివారం సాయంత్రం నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేశామని ఏఈ రాజ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 21, 22వ తేదీ మధ్యాహ్నం వరకు నీటి సరఫరా ఉండదన్నారు. పుల్కల్ మండలం చక్రియాల నుంచి రెండు నియోజకవర్గాలకు సరఫరా చేసే ప్రధాన పైపులైన్ లీకేజీలతో అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో త్వరితగతిన మరమ్మతులు చేపట్టి నీటిని యథావిధిగా సరఫరా చేస్తామని పేర్కొన్నారు. ఆయా మండలాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఐటీఐ ఏర్పాటుకు స్థల పరిశీలన


అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటు కోసం ఖేడ్ మండలం జూకల్ శివారులోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ఎదుట 161బీ జాతీయరహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆర్డీవో అశోకచక్రవర్తి, ఆర్ఐ మాధవరెడ్డిలతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఖేడ్‌కు ఐటీఐ మంజూరు చేయాలని ఎమ్మెల్యే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరుతూ వినతిపత్రాన్ని అందించిన నేపథ్యంలో రాష్ట్ర ఉపాధి, శిక్షణశాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ స్థలాన్ని పరిశీలించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న 2.20 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్లు ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో పురపాలిక ఉపఛైర్మన్ దారంశంకర్ తదితరులు ఉన్నారు.

ప్రగతి వైపు పోతిరెడ్డిపల్లి అడుగులు



సంగారెడ్డి అర్బన్(పోతిరెడ్డిపల్లి), న్యూస్‌టుడే: ఒకప్పుడు పోతిరెడ్డిపల్లి చిన్న పల్లెటూరు.. కాలక్రమేణా పట్టణ ప్రాంతంగా మారింది. 2018 అక్టోబరులో సంగారెడ్డి పట్టణంలో విలీనమైంది. ప్రగతి దిశగా పరుగులు తీస్తుంది. భారీ ఎత్తున బహుళ అంతస్తులు వెలిశాయి. ఈ పట్టణం మీదుగా ముంబయి-సంగారెడ్డి 65వ నంబరు జాతీయ రహదారి విస్తరించింది. 11 వరకు బ్యాంకులు ఉండటం విశేషం. విద్య, వైద్య, ఇతరత్రా సంస్థలకు చెందినవి ఇక్కడ భారీగానే వెలిశాయి. అదే స్థాయిలో వాణిజ్య వ్యాపార సంస్థల దుకాణాల సముదాయాలు నెలకొల్పారు. జనంతో నిత్యం ఈ ప్రాంతమంతా రద్దీగా ఉంటుంది.

కలెక్టరేట్ తలమానికం..

జిల్లా కేంద్రంలోని సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి పరిధిలోనే జిల్లా కలెక్టరేట్ ఉంది. 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా భూమి పూజ జరిగింది. 2011లో అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య భవనాన్ని ప్రారంభించారు. ఇందులో 38 శాఖలుంటాయి. కలెక్టర్‌తో పాటు ఇద్దరు అదనపు కలెక్టర్లు, డీఆర్వో, ఏవోలు కీలక విభాగాల జిల్లా అధికారులు ఇక్కడ కొలువుంటారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలిపి 700 మందికి పైగా విధులు నిర్వహిస్తుంటారు.

యాసంగి ప్రణాళిక ఖరారు!

• నిండుగా నీటి వనరులు • తప్పనున్న సాగునీటి ఇబ్బందులు

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్


సింగూర్ ప్రాజెక్టు

వానాకాలం సీజన్ ముగిసింది. అక్టోబరు 1 నుంచి యాసంగి మొదలైంది. ఖరీఫ్‌లో సాధారణం కంటే అత్యధిక వర్షపాతం నమోదు కావడంతో బోరుబావులు, నీటి కుంటలు, ప్రాజెక్టులు, చిన్ననీటి వనరులు నిండుగా ఉన్నాయి. భూగర్భ జలాలు సైతం పెరగడంతో అన్నదాతలకు అనుగుణంగా జిల్లా వ్యవసాయ శాఖ యాసంగి ప్రణాళిక సిద్ధం చేసింది. విత్తనాలు, ఎరువులకు ఇబ్బందులు తలెత్తకుండా కార్యాచరణ రూపొందించింది. గతేడాది యాసంగిలో అన్ని పంటలు కలిపి 1,91,639 ఎకరాల్లో సాగు చేయగా ఈసారి 2,01,193 ఎకరాల్లో సాగవుతుందని అంచనా.

సీజన్ చివర్లో అధిక వర్షపాతం

ఈసారి వానాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో అధిక వర్షపాతం నమోదైంది. జూన్‌లో 120 మిల్లీమీటర్లకు 139.7 మి.మీ., జులైలో 194.2 మి.మీలకు 188, ఆగస్టులో 190.4 మి.మీలకు 172, సెప్టెంబరులో 156 మి.మీలకు 260.7 మి.మీ అత్యధికంగా వర్షపాతం నమోదు కావడం గమనార్హం. ఈ లెక్కన చివరి రోజుల్లో సాధారణం కంటే అధికంగా నమోదైంది. దీంతో సింగూర్, నల్లవాగు ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. నీటి వనరులు జలకళ సంతరించుకున్నాయి.

జిల్లాలో సాగు వివరాలు

పంట	అంచనా ఎకరాల్లో	ఎప్పట్నుంచి వేయాలి
వరి	1.10 లక్షలు	నవంబరు 15 – డిసెంబరు 10
జొన్న	59000	అక్టోబరు 1 – డిసెంబరు 31
శనగ	20000	అక్టోబరు 1 – నవంబరు 15
మొక్కజొన్న	5,500	అక్టోబరు 1 – డిసెంబరు 31
గోధుమ	500	అక్టోబరు 25 – నవంబరు 30
తెల్లకుసుమలు	3100	నవంబరు 1 – అక్టోబరు 15
పొద్దు తిరుగుడు	402	నవంబరు 1 – డిసెంబరు 31
వేరుసెనగ	200	అక్టోబరు 1 – నవంబరు 15
చెరకు	1600	జనవరి 1 నుంచి మార్చి 31

విత్తనాలు ప్రణాళిక (క్వింటాళ్లలో)...	ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో)
వరి : 27,500	యూరియా: 18,413
శనగ: 6,000	డీఏపీ: 6308
వేరుసెనగ: 240	ఎంవోపీ: 4343
జొన్న: 2,360	కాంప్లెక్స్: 14,300
మొక్కజొన్న: 440	ఎస్ఎస్‌పీ: 3660
గోధుమ: 200	

అందుబాటులో విత్తనాలు, ఎరువులు



జిల్లాలో అంచనా మించి యాసంగి సాగు కావచ్చు. నీటి లభ్యత ఉంది. వరి నూర్పిళ్లు పూర్తి కాగానే వెంటనే వరి తూకాలు, ఇతరత్రా ఆరుతడి పంటలకు సిద్ధం చేసుకుంటే మేలు. అన్నదాతలకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచింది. –కె.శివప్రసాద్, డీఏవో.


కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం అంబారిపేటలోని మైసమ్మ ఆలయంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పూజలు నిర్వహించారు. కుటుంబసభ్యులతో ఆయన ఆదివారం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. – న్యూస్‌టుడే, దోమకొండ.

వసతి గృహంలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

మూసాపేట, న్యూస్‌టుడే: కళాశాల వసతి గృహంలో కుమార్తెను దించి ఇంటికి బయలుదేరిన ఆ కుటుంబికులు ఇల్లు చేరకముందే పిడుగులాంటి వార్త అందింది. దీంతో దారి మధ్యలోంచే తిరిగి వచ్చి కుమార్తె మృతదేహాన్ని చూసి హతాశులయ్యారు. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన దంపతులకు ముగ్గురు కుమార్తెలు. రెండో కుమార్తె (16) బాచుపల్లి చౌరస్తాలోని నారాయణ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. వసతి గృహంలో ఉండటంపై అనాసక్తితో ఉంటున్నట్లు తెలుస్తోంది. కొద్ది రోజులుగా ఇంట్లో ఉంటున్న ఆమెను ఆదివారం సాయంత్రం కారులో తీసుకొచ్చి కుటుంబ సభ్యులు వసతి గృహం వద్ద దించి వెళ్లారు. ఆ సమయంలో ఇంటికి బయలుదేరిన వారిని ఆమె ఆనందంగా సాగనంపింది. దీంతో వారు వచ్చిన కారులోనే తిరిగి ప్రయాణమయ్యారు. అయితే సగం దూరం వెళ్లగానే హాస్టల్ నిర్వాహకులు ఆ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఫోన్ చేసి చెప్పారు. దీంతో కంగారుగా తిరిగి వసతిగృహం వద్దకు వచ్చి కూతురు శవాన్ని చూసి కుప్పకూలిపోయారు. వారి రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతు భరోసాపై వెల్లువెత్తిన నిరసన


జహీరాబాద్‌లో రోడ్డుపై బైఠాయించిన ఎమ్మెల్యే మాణిక్‌రావు, భారాస నాయకులు

జహీరాబాద్ అర్బన్, హత్నూర, న్యూస్‌టుడే: అన్నదాతలకు వానాకాలం రైతు భరోసా ఇవ్వపోవడాన్ని నిరసిస్తూ భారాస శ్రేణులు ఆదివారం ఆందోళనకు దిగారు. జహీరాబాద్‌లో ఎమ్మెల్యే మాణిక్‌రావు, దౌల్తాబాద్‌లో ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేసిందని మండిపడ్డారు. జహీరాబాద్‌లో ఎమ్మెల్యే రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం దిష్టిబొమ్మ దహనం చేసేందుకు తీసుకొస్తుండగా పోలీసులు అడ్డుకునేందుకు యత్నించడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది.

దౌల్తాబాద్‌లో నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన దారిపై సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమాల్లో జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, కోహీర్, ఝరాసంగం, హత్నూర మండలాల నాయకులు నారాయణ, నారాయణ, రవీందర్, నర్సింలు, వెంకటేశం, దేవేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, చంద్రాగౌడ్, పోచయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


దౌల్తాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

సాగుకే మంజీరా నీరు: సీపీఎం

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్: ఆరు గ్యారంటీ హామీల వాగ్దానంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్కా రాములు అన్నారు. జహీరాబాద్ పట్టణంలో నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా మూడో మహాసభలో రెండో రోజైన ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్భాటంగా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఒకటి, రెండు హామీలే అమలు చేశారని, మిగిలిన వాటిని ఎప్పుడు అమలుచేస్తారని ప్రశ్నించారు. రైతు రుణమాఫీలోనూ ఆంక్షల పేరిట అర్హులకు మొండిచేయి చూపారని ఆరోపించారు. సభలో 15 తీర్మానాలు ప్రవేశపెట్టారు. జిల్లా మీదుగా పారుతున్న మంజీర నీటిని సాగుకు కేటాయించాలన్నారు. సంగారెడ్డి వరకు మెట్రో రైలును పొడిగించడం సహా నాలుగు కొత్త లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాటాలు ఉద్ధృతం చేయాలని నిర్ణయించారు.


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్కా రాములు

జిల్లా కార్యదర్శిగా కొత్తపల్లి జయరాజు..: సభలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా కొత్తపల్లి జయరాజు, కార్యదర్శి వర్గ సభ్యులుగా బీరం మల్లేశం, కె.రాజయ్య, బి.రాంచందర్, ఎ.మాణిక్, జి.సాయిలు, ఎం.నర్సిములుతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.



ప్రతిష్ఠోత్సవంలో ప్రత్యేక పూజలు

వర్గల్, ములుగు, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తున్కిఖల్సాలో ఆదివారం జరిగిన పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠోత్సవంలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

అతివలకు ఆర్థిక చేయూత

• క్యాంటీన్లు, మిల్క్ పార్లర్ల కేటాయింపు
• జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాచరణ

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సంగారెడ్డి టౌన్, జోగిపేట, జహీరాబాద్ అర్బన్, నారాయణఖేడ్: మహిళలను కోటీశ్వరులుగా మార్చాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ క్రమంలోనే స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి వ్యాపార రంగంలో రాణించేలా చర్యలకు శ్రీకారం చుడుతోంది. మహిళా సంఘ సభ్యులతో పాటు పలువురికి ఉపాధి కల్పించేలా చేయూతనిస్తోంది. ఆర్థిక భరోసాకు ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పటికే ఇందిర మహిళా శక్తి పథకంతో అక్కున చేర్చుకుంటోంది.


సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన మిల్క్ పార్లర్

ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా 13 అంశాలపై మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించనుంది. జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులను 'ఇందిర మహిళా శక్తి పథకం'లో ఎంపిక చేస్తుంది. శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తుంది. క్యాంటీన్ ఏర్పాటు చేసుకునే వారు రూ.3 లక్షలు, మిల్క్‌పార్లర్ నిర్వహణకు రూ.2 లక్షల రుణాలు ప్రభుత్వమే ఇస్తోంది. సభ్యులు వాటిని నెలవారీగా బ్యాంకుల్లో చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. జిల్లాలో 10 మహిళా శక్తి క్యాంటీన్లు, ఒక మిల్క్‌పార్లర్ ఏర్పాటు చేయాలనేది లక్ష్యం. ఈ క్రమంలోనే సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో మిల్క్‌పార్లర్ వినియోగంలోకి తీసుకొచ్చారు. దౌల్తాబాద్ మండలం నస్తీపూర్, పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లలో క్యాంటీన్లు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన వాటిని త్వరలో తేనున్నారు.

ఎక్కడెక్కడంటే..: సదాశివపేట, అందోల్, కంది, నారాయణఖేడ్, సంగారెడ్డిలోని పాత డీఆర్‌డీఏ కార్యాలయం ఆవరణ, సంగారెడ్డి కలెక్టరేట్, జహీరాబాద్, ఝరాసంగంలలో క్యాంటీన్లు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. జనం రద్దీగా ఉండే ప్రదేశాలను ఎంపిక చేయనున్నారు. ఇవే కాకుండా పాడిగేదెల పెంపకం, డెయిరీ ఫామ్ ఏర్పాటు, కోళ్లఫారాలు, కస్టం హైరింగ్ సెంటర్లు, ఇతర ఆహార శుద్ధి యూనిట్లు కూడా ఉన్నాయి. వీటికి రుణాలు ఇచ్చేలా డీఆర్‌డీవో శాఖ చర్యలు చేపడుతోంది.

• జిల్లాలో గ్రామైక్య సంఘాలు: 695
• మహిళా స్వయం సహాయక సంఘాలు: 18,795
• సభ్యులు: 1.90 లక్షల మంది

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



మహిళా సంఘాల సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు రావాలి. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకునేలా రుణాలిచ్చి ప్రోత్సహిస్తోంది. త్వరలో కలెక్టరేట్‌లో, కందిలో, ఝరాసంగం దేవాలయం సమీపంలో క్యాంటీన్లు వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. –జ్యోతి, డీఆర్‌డీవో, సంగారెడ్డి.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటాలి

సంగారెడ్డి అర్బన్, కొండాపూర్, న్యూస్‌టుడే: రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ తూర్పు నిర్మలారెడ్డి అన్నారు. ఆదివారం కొండాపూర్ మండలం మల్కాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో సంగారెడ్డి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... గ్రామ, మండలాల వారీగా కొత్త ఓటర్లను నమోదుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ, పీసీసీ కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు అనంతకిషన్, రాంరెడ్డి, ప్రభు, రాంచందర్‌నాయక్, కిరణ్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, మనోజ్‌రెడ్డి, జార్జ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి

వాలీబాల్ విజేత మెదక్ జట్టు

మెదక్ టౌన్, రూరల్: ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి బాలుర అండర్-17 వాలీబాల్ విజేతగా మెదక్ జట్టు నిలిచింది. పాఠశాల క్రీడ సమాఖ్య(ఎస్‌జీఎఫ్) మెదక్ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం మంభోజిపల్లిలోని గీతా పాఠశాల మైదానంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. బాలుర విభాగం ఫైనల్‌లో మెదక్, సిద్దిపేట జట్లు పోటీపడగా మెదక్ జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో సిద్దిపేట, తృతీయ స్థానంలో సంగారెడ్డి జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో సంగారెడ్డి, ద్వితీయ స్థానంలో సిద్దిపేట, తృతీయ స్థానంలో మెదక్ జట్లు నిలిచాయి.

శౌర్యానికి ప్రతీక సేవా దీపిక

నేడు ఫ్లాగ్ డే



న్యూస్‌టుడే, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి అర్బన్, వికారాబాద్

ఎక్కడ ఘర్షణలు తలెత్తినా.. నాయకులు, ప్రజల మధ్య గొడవలు చోటుచేసుకున్నా ముందుగా ప్రత్యక్షమయ్యేది పోలీసే. రాత్రి, పగలు తేడా లేకుండా శాంతిస్థాపనే లక్ష్యంగా అలుపెరగక ముందుకు సాగుతున్న రక్షకులకు సెల్యూట్ చేయాల్సిందే. శాంతిభద్రతల రక్షణకు శ్రమించే ఎంతో మంది ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. సమాజాన్నే కుటుంబంగా భావించే ఖాకీలు అంకితభావంతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తున్నారు. సాంకేతికత తోడుగా నేరాలను ఛేదిస్తున్నారు. సేవా స్ఫూర్తి చాటుతూనే ప్రజా చైతన్యం తెస్తున్నారు. నేడు పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్‌డే) సందర్భంగా కథనం.

	సిద్దిపేట	సంగారెడ్డి	మెదక్	వికారాబాద్
పోలీసు స్టేషన్లు	27	32	21	19
అధికారులు, సిబ్బంది	1227	796	788	1191
హోంగార్డులు	208	274	146	696
కళాబృందం	01	01	01	03

నాన్న బాటలో అడుగేసి..



మెదక్ జిల్లా పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌పై 1999 సెప్టెంబరు 13న రాత్రి మావోయిస్టులు జరిపిన దాడిలో ఒక హెడ్ కానిస్టేబుల్, నలుగురు కానిస్టేబుళ్లు ప్రాణాలు కోల్పోయారు. మృతి చెందిన వారిలో సంగారెడ్డికి చెందిన కానిస్టేబుల్ ప్రసాద్ ఉన్నారు. ఆయన రెండో కుమారుడు విద్యాసాగర్ నాన్న బాటలోనే నడవాలని నిర్ణయించుకున్నారు. ఈ శాఖలోనే చేరి ప్రస్తుతం మెదక్ జిల్లా పోలీసు కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా పని చేస్తున్నారు. **- పాపన్నపేట**

ఆనాటి ఘటనలు..

● హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: 1991లో హుస్నాబాద్ సీఐ యాదగిరి, ఎస్‌ఐ జాన్‌విల్సన్ హుస్నాబాద్ మండలం రామవరంలో బస్సును పీపుల్స్‌వార్ దళ సభ్యులు బాంబుతో పేల్చివేయడంతో ప్రాణాలు కోల్పోయారు. దౌల్తాబాద్ ఎస్‌ఐ రాజగోపాలచారి, హెడ్‌కానిస్టేబుల్ చంద్రయ్య.. దౌల్తాబాద్ శివారులో నక్సలైట్ల కాల్పుల్లో మరణించారు. ● 1997 నవంబరు 17న శివ్వంపేట మండలం పిల్లుట్లలో నక్సల్స్ ఓ ఇంటిని పేల్చారు. దాని పరిశీలనకు వెళ్లిన అప్పటి తూప్రాన్ డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సీఐ వెంకటస్వామి, హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య, శ్రీనివాసరావు, సుజత్‌అలీ, లక్ష్మణ్‌నాయక్ మందుపాతర పేలుడులో చనిపోయారు. ● 2012 మార్చి 28న అర్ధరాత్రి వేళ కోహీర్‌లోని సిండికేట్ బ్యాంకులో అంతర్రాష్ట్ర ముఠా సభ్యులు కలిసి బ్యాంకు దోపిడీ చేస్తున్నట్లు సైరన్ మోగింది. స్థానిక పోలీసులకు సమాచారం అందగా ఎస్‌ఐ నోముల వెంకటేశ్, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ వెళ్లారు. వారిని పట్టుకునే యత్నంలో దోపిడీ దొంగలు నాటు తుపాకులతో కాల్చగా ఎస్‌ఐకి తూటా తగిలింది. అయినా లెక్క చేయకుండా వారిని పట్టుకున్నారు.

స్నేహపూర్వకంగా..

వివిధ సందర్భాల్లో మహిళలకు బాసటగా నిలవడంలో 'స్నేహిత' ముందంజలో నిలుస్తోంది. సిద్దిపేట వన్‌టౌన్ పోలీసు ఠాణా సమీపంలో గతేడాది జనవరి 5న ఈ మహిళా సహాయక కేంద్రం ప్రారంభమైంది. ఇప్పటి వరకు 1,261 ఫిర్యాదులు స్వీకరించగా పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. పోలీసు స్టేషన్లలో నమోదయ్యే మహిళల కేసులు.. జిల్లా కేంద్రంలోని మహిళా పోలీసు ఠాణాకు, తదుపరి 'స్నేహిత'కు చేరవేస్తున్నారు. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో కొనసాగుతోంది. సీపీ డా. అనురాధ సమీక్షిస్తూ.. దిశానిర్దేశం చేస్తున్నారు. స్వార్డ్ సంస్థ కార్యదర్శి శివకుమారి పర్యవేక్షిస్తున్నారు. వారంలో ఒకరోజు న్యాయవాది అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. మూడు నుంచి ఐదుమార్లు కౌన్సెలింగ్ చేస్తున్నారు.



సైబర్ క్రైమ్ పోలీసు ఠాణాతో..



సైబర్ నేరాల అడ్డుకట్టపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. గతేడాది ఆగస్టులో సిద్దిపేట పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ అందుబాటులోకి తెచ్చారు. ఏసీపీ, ఇన్‌స్పెక్టర్, ఐదుగురు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. రూ.లక్షకు పైగా సైబర్ మోసం జరిగితే ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. వివిధ స్థాయిల్లో దర్యాప్తును ఠాణాల వారీగా పోలీసులకు మార్గనిర్దేశనం చేస్తున్నారు. సాంకేతికతతో ఛేదిస్తున్నారు. సామాజిక మాధ్యమాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు.

30 గంటల్లో ..

సంగారెడ్డిలోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో అమ్మమ్మ, నాయనమ్మ కళ్లుగప్పి పసికందును గుర్తుతెలియని మహిళలు అపహరించారు. పోలీసులు సాంకేతిక సాయంతో 30 గంటల్లో ఛేదించారు. మనూరు మండలం దూదిగొండకు చెందిన అబ్బాస్, నసీమా దంపతులు. నసీమా ఈ నెల 8న ప్రసవానికి ఆసుపత్రిలో చేరగా ఆడపిల్ల జన్మించింది. మరుసటి రోజు ఇద్దరు మహిళలు పాపను ఎత్తుకెళ్లారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, పట్టణ సీఐ భాస్కర్‌లు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఎస్పీ చెన్నూరి రూపేష్ సూచనలతో సీసీ కెమెరాలను పరిశీలించారు. తనిఖీలు ముమ్మరం చేశారు. హైదరాబాద్‌లోని బోరబండలో నిందితులు ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లి వారిని పట్టుకున్నారు. పసికందును తల్లి ఒడికి చేర్చారు.




తల్లికి చిన్నారిని అప్పగించిన డీఎస్పీ, సీఐ

మూడు తరాల్లో..



ఇమామ్



జాని బాషా



నయీమ్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా నకిరేకల్ మండలం గుండ్లపల్లికి చెందిన షేక్ ఇమామ్ సాహెబ్ కానిస్టేబుల్‌గా పని చేసి 1989లో పదవీ విరమణ పొందాడు. ఆయన స్ఫూర్తితో కొడుకు షేక్ జానిబాషా 1992లో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. తూప్రాన్‌లో హెడ్ కానిస్టేబుల్ విధులు నిర్వర్తిస్తున్నారు. జానిబాషా కొడుకు షేక్ నయీమ్ పాషా హైదరాబాద్ కొండాపూర్‌లో కానిస్టేబుల్ శిక్షణ పొందుతున్నారు. మూడు తరాల వారు పోలీసుల శాఖలోనే ఉండటం గమనార్హం. **- న్యూస్‌టుడే, తూప్రాన్**

గజపాద ఘట్టం.. వీక్షించిన భక్తజనం



ఫసల్‌వాదిలో గజరాజు ప్రదర్శన



సామూహిక కుంకుమార్చనలో భక్తులు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ఆదివారం గజపాద ఘట్ట మహోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా విద్యాపీఠం నుంచి మంజీరా తీరం వరకు ఊరేగింపు చేపట్టారు. నదిలో గజరాజుకు స్నానం చేయించారు. అనంతరం విద్యాపీఠంలో నిర్మిస్తున్న ఆలయం చుట్టూ గజపాద ఘట్ట మహోత్సవం నిర్వహించారు. గజరాజుతో ప్రదర్శన చేపట్టారు. అనంతరం సామూహిక కుంకుమార్చన జరపగా.. స్థానిక భక్తులు పాల్గొన్నారు. ఆటపాటలు, కోలాటంతో అలరించారు. పీఠం వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి తదితరులున్నారు.

పత్తి రైతులకు తప్పనున్న నిరీక్షణ

న్యూస్‌టుడే, గజ్వేల్, సంగారెడ్డి అర్బన్, మెదక్, పరిగి

ఉమ్మడి మెదక్ జిల్లాలో వరి సాగు తర్వాతి స్థానం పత్తిదే. వికారాబాద్ జిల్లాలో ఇది మూడో స్థానంలో ఉంటుంది. ప్రస్తుతం పత్తి చేతికొచ్చే సమయం కావడంతో దీన్ని సాగు చేసిన రైతులు విక్రయించేందుకు మిల్లుల వద్ద పడిగాపులు నిరీక్షిస్తుంటారు. దీనికి ఇక నుంచి తెరపడనుంది. ప్రస్తుతం పొలాల క్రయ, విక్రయాలకు అమలు చేస్తున్న స్లాట్ విధానాన్ని పత్తి విక్రయాల్లోనూ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే నిర్మల్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న ఈ విధానాన్ని త్వరలోనే అన్ని జిల్లాల్లో శ్రీకారం చుట్టనుండటం విశేషం.



గజ్వేల్ సీసీఐ కేంద్రంలో బారులు తీరి..

సీసీఐ కేంద్రాల్లో..

పొలాల నుంచి సేకరించిన పత్తిని సీసీఐ కేంద్రాల్లో అమ్మేందుకు వెళ్లే రైతులు ఒక్కోసారి జిన్నింగ్ మిల్లుల గేట్ల వద్ద నిరీక్షిస్తుంటారు. పలు సందర్భాల్లో అక్కడే నిద్రించి తమ వంతు ఎప్పుడొస్తుందా అని రోజులకొద్దీ ఎదురు చూసే పరిస్థితి. దీంతో ఎంతోమంది ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకొని నష్టపోతుంటారు. పత్తి కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని రైతులు ధర్నాలు చేసిన ఘటనలెన్నో ఉన్నాయి. వీటికి చెక్ పెట్టేందుకు కొత్త విధానం ఉపయోగపడనుంది.

54 స్పిన్నింగ్ మిల్లులు..

సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో 46 మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయి. మెదక్ జిల్లాలో మిల్లులు లేవు. ఇక్కడి వారంతా సంగారెడ్డి, సిద్దిపేటకు వెళ్తుంటారు. వికారాబాద్ జిల్లాలో 8 మిల్లులు ఉన్నాయి.

ఎలా చేస్తారంటే..

పత్తి రైతులు ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తేదీ, సమయం సూచిస్తూ సమాచారాన్ని రైతుల చరవాణికి పంపిస్తారు. ఆరోజు నేరుగా కేటాయించిన మిల్లుకు దిగుబడిని తీసుకొచ్చి అమ్ముకోవచ్చు.

సిద్దిపేట ■ సంగారెడ్డి ■ మెదక్ ■ వికారాబాద్ ■

నాలుగు జిల్లాల్లో పత్తి సాగు (లక్షల ఎకరాల్లో)

సిద్దిపేట	సంగారెడ్డి	మెదక్	వికారాబాద్
3.35	1.04	0.36	2.5

జిన్నింగ్ మిల్లులు

సిద్దిపేట	సంగారెడ్డి	మెదక్	వికారాబాద్
24	22	00	08

మద్దతు ధర

పొడవు రకం: రూ.7521

మధ్య రకం: రూ.7121

క్రీస్తును స్మరించి.. భక్తితో ఆరాధించి



భక్తిగీతాలు ఆలపిస్తున్న భక్త బృందం

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: క్రీస్తు నామస్మరణతో ప్రఖ్యాత మెదక్ సీఎస్ఐ చర్చి ఆదివారం సందడిగా మారింది. గురువులు శిలువను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రార్థనా మందిరంలో ప్రతిష్ఠించారు. మెదక్ ప్రెసిబేటరి ఇన్‌ఛార్జి శాంతయ్య ఆధ్వర్యంలో ఆరాధనలు చేపట్టారు. ఆయనతో పాటు వనస్థలిపురం ప్రెసిబేటరీ ఇన్‌ఛార్జి జాన్ సుందర్ దైవసందేశాన్ని వినిపించారు. ఉమ్మడి జిల్లాతో పాటు పొరుగు జిల్లాల, రాష్ట్రాల నుంచి భక్తులు, పర్యాటకులు కుటుంబ సమేతంగా తరలివచ్చి ఏసయ్యను దర్శించుకుని తన్మయత్వం పొందారు. భక్త బృందం క్రీస్తును స్తుతిస్తూ పాడిన పాటలు అలరించాయి. గురువులు డేవిడ్ రిచర్డ్, జైపాల్, శ్రీనివాస్ భక్తులకు ఆశీర్వచనాలు అందించారు.

స్వర్ణోత్సవ ఆత్మీయ సమ్మేళనం



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కళాశాలలో 1972-75 బీఎస్సీ ఎంపీసీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. 50 వసంతాల తర్వాత అంతా ఒకచోటుకు చేరి ఆత్మీయంగా పలకరించుకుంటూ తమ మధురజ్ఞాపకాలు పంచుకున్నారు. వీరిలో ప్రముఖ కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రథమ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ నాగభూషణం, భాజపా రాష్ట్ర నాయకులు వంగ రాంచంద్రారెడ్డి, వీహెచ్‌పీ తెలంగాణ పూర్వ ఆర్గనైజర్ గాల్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు కొమురవెల్లి అంజయ్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.అయోధ్యరెడ్డిని సన్మానించారు.

బాధిత కుటుంబానికి నష్టపరిహారం

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా చేగుంట మండలానికి చెందిన పాండ్యాల రాజుగౌడ్ తన కుటుంబంతో కలిసి బతుకుదెరువు నిమిత్తం పద్మానగర్ ఫేజ్‌2కు వచ్చి నివసిస్తున్నాడు. ఇంటి యజమానురాలు సురేఖ ఇంటి గోడలు షాక్ కొడుతున్నాయని చెప్పడంతో రాజుగౌడ్ వచ్చి పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వివేకానంద్ విద్యుత్తు అధికారులతో మాట్లాడి రూ.5 లక్షలు మంజూరు చేయించారు. ఆ చెక్కును ఎమ్మెల్యే రాజు భార్య నవ్యకు ఆదివారం అందజేశారు.

పంట రక్షణ తీగ.. ప్రాణం తీసింది

తల్లి, అన్న కళ్లముందే తమ్ముడి దుర్మరణం



బాలరాజు

పరిగి, పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: ఇద్దరు కొడుకులు తల్లి కలిసి.. సీతాఫలాలు అమ్మారు. చీకటి పడగానే.. ముగ్గురూ ముచ్చట్లోపడి.. ఇంటి దారి పట్టారు. అంతలోనే.. ముందు నడుస్తున్న చిన్నకొడుకు కాలికి విద్యుత్తు తీగ తగిలింది. గిలగిలా కొట్టుకుంటున్న ఆ బిడ్డను రక్షించలేక.. తన తమ్ముడు తన కళ్లముందే.. మృత్యువుతో పోరాడుతున్నా.. ఏం చేయలేని నిస్సహాయతతో ఇద్దరూ విలవిల్లాడారు. పరిగి మండలం రంగంపల్లిలో ఈ విషాదకరఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. రంగంపల్లి గ్రామానికి చెందిన ఎలిచెలి పార్వతమ్మకు ఇద్దరు కుమారులు రాములు, బాలరాజు (28) ఉన్నారు. వారంతా వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో సీతాఫలాలు విక్రయిస్తున్నారు. అడవిలో సేకరించిన ఫలాల్ని బీజాపూర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న చింతల్‌చెరువులో అమ్మకాలు సాగిస్తున్నారు. శనివారం ముగ్గురూ కలిసి కాయలను అమ్మకాలు జరిపారు. తిరుగు ప్రయాణంలో అదే గ్రామానికి చెందిన కౌలు రైతు పిట్ల వెంకటయ్య పొలం దారిలో ఇంటికి వెళుతున్నారు. రైతు అడవి పందుల నుంచి రక్షణకు ఏర్పాటు చేసిన.. విద్యుత్తు తీగపై బాలరాజు కాలు పడింది. దీంతో కరెంటు సరఫరా జరిగి ఒక్కసారిగా కిందపడి కొట్టుకుంటున్నాడు. అతడిని కాపాడేందుకు తల్లి ప్రయత్నించగా.. రాములు వెంటనే తల్లిని వెనక్కి జరగాలని బిగ్గరగా అరిచాడు. అంతే.. ఆమె వెనక్కి జరగగా.. క్షణాల్లో బాలరాజు అచేతనంగా పడిపోయాడు. వారి కేకలు విన్న గ్రామస్థులు అక్కడికి చేరుకున్నారు. విద్యుత్తు సరఫరా నిలిపివేసి పరిశీలించగా.. యువకుడు తుది శ్వాస విడిచాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పురుగుమందు తాగి దంపతుల ఆత్మహత్య



ప్రతాప్‌సింగ్



కళావతి

ఝరాసంగం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో దంపతులు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం సంగారెడ్డి జిల్లా ఝరాసంగంలో ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ సీఐ హన్మంతు, ఎస్సై నరేశ్ వివరాల ప్రకారం.. ఝరాసంగానికి చెందిన బొందిల ప్రతాప్‌సింగ్(60), కళావతి(55) దంపతులు కొన్నేళ్లుగా కేతకి ఆలయ సమీపంలో అల్పాహారం, టీ స్టాల్ నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. కొన్నాళ్లుగా వ్యాపారంలో నష్టాలు రావడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ క్రమంలో తరచుగా భార్యభర్తల మధ్య గొడవలు కూడా జరుగుతున్నాయి. ఆదివారం సాయంత్రం గ్రామ సమీపంలో వారి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన ఇద్దరు అక్కడే పురుగుమందు తాగి పడిపోయారు. చుట్టుపక్కల పొలాల రైతులు గుర్తించి వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. ఈ దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరికి వివాహాలు అయ్యాయి. కుమారుడు తల్లిదండ్రుల నుంచి వేరుగా ఉంటున్నాడు. ప్రతాప్ సింగ్ సోదరుడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనం మలుపు తీసుకుంటుండగా ప్రమాదం.. మెకానిక్ మృతి



స్వామి

బెజ్జంకి, న్యూస్‌టుడే: రాజీవ్ రహదారి కూడలిలో మలుపు తీసుకుంటున్న ద్విచక్ర వాహనదారుడిని కారు వేగంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా బెజ్జంకి క్రాసింగ్‌లో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి సమచారం ప్రకారం.. గ్రామానికి చెందిన బింగి స్వామి(42) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ నెల 19న గాగిళ్లాపూర్‌లో పని నిమిత్తం తన వాహనంపై వెళ్లి తిరుగుపయనమయ్యాడు. పెట్రోల్ పోసుకునేందుకు గ్రామ శివారులో మలుపు తీసుకుంటుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న కారు ఢీ కొట్టింది. ప్రైవేటు ఆస్పత్రికి స్వామిని తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుమారుడు వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బైకు అదుపుతప్పి రైతు..



నర్సింలు

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందిన ఘటన సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట- భూంపల్లి మండలం ఖాజీపూర్ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం గాజులపల్లిలో పోచమ్మ ఆలయం నిర్మాణం చేపడుతున్నారు. గ్రామానికి చెందిన రైతు గొల్లపల్లి చిన్న నర్సింలు (58) మరికొందరు గ్రామస్థులతో కలిసి తుజాల్‌పూర్‌లోని ఆలయ నమూనాను పరిశీలించడానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వాహనం అదుపుతప్పి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల విజేత నిజామాబాద్ జట్టు



నిజామాబాద్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సీఐలు కంప రవీందర్, రాఘవేందర్ తదితరులు

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2024-25 పోటీల్లో నిజామాబాద్ జట్టు మొదటి, మహబూబ్‌నగర్ జట్టు ద్వితీయ, మెదక్ జట్టు తృతీయ పతకాలు సాధించినట్లు వరంగల్ జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్ తెలిపారు. రామగుండం స్పెషల్‌బ్రాంచ్ సీఐ కంప రవీందర్, ఎనుమాముల సీఐ రాఘవేందర్ విజేతలకు బహుమతులు అందజేశారు. వరంగల్ రెడ్డిపాలెంలోని ఇన్ఫాంట్ జీసస్ కాన్వెంట్ పాఠశాలలో ఆదివారం జరిగిన ముగింపు సమావేశాల్లో ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. జీవితంలో గెలుపు కోసం నిరంతరం శ్రమించాలని క్రీడాకారులకు సూచించారు. సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి పూజారి అశోక్‌బాబు, బీమగాని ముఖర్జీ, పాఠశాల ప్రిన్సిపల్ మరియమ్మ మాథ్యూ పాల్గొన్నారు.

కాలువలో స్నానానికి దిగి మృత్యువాత



గోపాల్

న్యాల్‌కల్, జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: స్నానానికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం చాల్కీ గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హద్నూర్ పోలీసుల కథనం ప్రకారం... రంజోల్ గ్రామానికి చెందిన కమ్మరి గోపాల్(21) జహీరాబాద్, పస్తాపూర్, చాల్కీ ప్రాంతాల్లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వచ్చిన డబ్బులను నిత్యం మద్యం తాగడానికి ఖర్చు చేసేవాడు. రెండు మూడు రోజులుగా ఆయన పనికి వెళ్లడం లేదు. రెండు రోజుల కిందట చాల్కీలోని కొత్త కాలువకు స్నానానికి వెళ్లిన గోపాల్ ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. దీనికి ఎవరూ గుర్తించలేదు. ఆదివారం నీటిలో కనిపించిన మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. గోపాల్ మృతిపై అనుమానాలు లేవని, ప్రమాదవశాత్తు మృతిచెంది ఉంటాడని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

బస్సెక్కుతుండగా... ఆభరణాల చోరీ

నారాయణఖేడ్: ఓ మహిళ బస్సు ఎక్కుతుండగా బ్యాగు నుంచి గుర్తుతెలియని వ్యక్తులు 6.30 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన ఆదివారం స్థానికంగా చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... నాగల్‌గిద్ద మండలం ఎనక్‌పల్లికి చెందిన నిర్మల కొన్నేళ్లుగా కుటుంబీకులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నారు. సిర్గాపూర్ మండలం ఉజలంపాడ్‌లో బంధువుల ఇంట్లో ఓ శుభకార్యం నిమిత్తం వచ్చి తిరిగి వెళ్తుండగా ఖేడ్ రాజీవ్ కూడలిలో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలు ఖేడ్ ఠాణాలో ఫిర్యాదు చేయగా.. పోలీసులు విచారిస్తున్నారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	120-00	డ్రెస్డ్	206-00
రిటైల్	142-00	స్కిన్‌లెస్	234-00

వృద్ధులకు ఆరోగ్య భరోసా

ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సిద్దిపేట, మెదక్, వికారాబాద్ కలెక్టరేట్

వృద్ధాప్యంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ వయసులో ఉన్న వారిని పసి పిల్లలుగా కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి ఉంటుంది. కొంత మందికి కుమారులు ఉన్నా వేదనే మిగులుతోంది. రోగాలబారిన పడ్డా ఎవరూ పట్టించుకోరు. ఇలాంటి కష్టకాలంలో ఉన్న వయోవృద్ధులకు మేమున్నాం అంటూ భరోసా కల్పించేలా ఉచిత వైద్య సేవలు అందించాలని కేంద్రం సంకల్పించింది. ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఈ ప్రక్రియ అమలు చేయనుంది. ఇందుకు వారి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయనున్నారు.



సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ వార్డు

1835 రకాలుగా..

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అన్ని వయసుల వారికి రూ.10 లక్షల వరకు వైద్య సేవలు అందిస్తున్న విషయం విదితమే. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఈ సేవలు అందిస్తున్నారు. ఈ పథకం కింద 1835 రకాల రోగాలు ఉన్న వారికి దీన్ని వర్తింపజేస్తున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలుచేస్తోంది. దీని కింద వయోవృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించాలని నిర్ణయం తీసుకోవడంతో నాలుగు జిల్లాల వారికి మేలు చేకూరనుంది.

జిల్లాల్లో వయోవృద్ధులు

జిల్లా	వయోవృద్ధులు
సంగారెడ్డి	61,991
సిద్దిపేట	40,360
మెదక్	32,130
వికారాబాద్	39,153

దరఖాస్తు ఇలా..

ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (ఏబీపీఎంజేఏవై) వైబ్‌సైట్ https:///ayushmanup.in ను సందర్శించాలి. అందులో ఆయుష్మాన్ భారత్(ఏఎంఐ) ఎలిజిబుల్ ట్యాబ్‌పై క్లిక్ చేయాలి. చరవాణి నంబరు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. దానితో ధ్రువీకరించుకోవాలి. గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రం వివరాలు, ఆధార్ కార్డు వివరాలు నమోదు చేయాలి. ఇలా ఈ-కేవైసీ పూర్తవగానే ఆమోదం కోసం వేచి ఉండాలి. ఈ ప్రక్రియ పూర్తయితే కార్డు తెరపై కనిపిస్తుంది. దాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

యాప్‌లో నమోదుకు..:



కేంద్రం ఆయుష్మాన్ భారత్ పథకం కింద 70 ఏళ్ల పైబడిన వయోవృద్ధులకు ప్రత్యేకంగా కార్డులు జారీ చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. మీసేవ, కామన్ సర్వీస్ సెంటర్లలో కార్డులు పొందవచ్చు.

నరేష్, రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్, జిల్లా సమన్వయకర్త, సంగారెడ్డి

ప్రయోజనాలిలా..

రూ.5 లక్షల వైద్య సాయం పొందే వీలుంది. మూడు రోజుల పాటు ఉచితంగా ఆసుపత్రిలో చేర్చుకోవడం, వైద్య పరీక్షలు, చికిత్స, ఇంటెన్సివ్‌కేర్ తదితర సేవలు పొందవచ్చు. దవాఖానాలో చేరాక 15 రోజుల వరకు సంరక్షణ ఉచితంగా లభిస్తుంది. మందులు, వసతి, పోషకాహారం అందజేస్తారు.

భాషల పరిరక్షణ తప్పనిసరి: వీసీ



అవార్డు గ్రహీతలు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : భారతీయ భాషలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్‌రావు ఉద్బోధించారు. లేకుంటే భవిష్యత్తులో ప్రమాదంలో పడతాయన్నారు. అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా కళాశాలలో సదస్సు చేపట్టారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన సాహితీవేత్తలకు అవార్డులు, పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో డీకే ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.గిరి, అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ జాతీయ అధ్యక్షులు వీరేంద్రసింగ్, ప్రధాన కార్యదర్శి చతుర్వేది, తెలంగాణ అధ్యక్షులు సత్యమూర్తి, కార్యదర్శి చక్రవర్తి, మద్రాస్ విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎలిజబెత్ జయకుమారి, ఒడియా కవయిత్రి సుశ్రీసంగీత మిశ్ర, ఆంగ్ల కవి లక్ష్మణరావు, హిందీ రచయిత రామలింగేశ్వరరావు, నారాయణ ఐఏఎస్ అకాడమీ ప్రిన్సిపల్ కె.సరోజినీదేవి, కవి పెరుగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేచిఉండే ప్రాంతం... మురుగు కూపం!



పోతిరెడ్డిపల్లి(సంగారెడ్డి అర్బన్), న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోనే అక్కడి బస్ పాయింట్ వద్ద భారీ సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అదేస్థాయిలో ఆర్టీసీ సంస్థకు ఆదాయం కూడా తెచ్చిపెడుతుంది. అక్కడ మాత్రం రెండు నెలలుగా పరిస్థితులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఇది ఎక్కడో కాదు.. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి కూడలిలోని ఆర్టీసీ బస్ పాయింట్ వద్ద నెలకొన్న దుస్థితి. రెండు నెలల కిందట పోతిరెడ్డిపల్లి నుంచి మదీనగూడ వరకు 'ఎక్స్‌ప్రెస్ హైవే' విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు తవ్వకాలు చేసి వదిలేశారు. తదుపరి వర్షాలు కురవడంతో ఆ ప్రాంతం చిన్నపాటి కుంటలా మారింది. ఇందులో దోమలు, ఈగలు వృద్ధిచెంది దుర్వాసన వస్తుంది. పట్టణంలోని పురపాలక, ఆర్టీసీ, నేషనల్ హైవే అథారిటీ శాఖల అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రయాణికులకు దుర్వాసన మధ్య బస్సుల కోసం నిరీక్షించాల్సివస్తుంది. శాఖల మధ్య సమన్వయ లోపం ప్రయాణికులకు శాపంగా మారింది. కనీసం అక్కడ నిలిచిన నీటిని బయటకు పంపి పరిసరాలు శుభ్రత పాటిస్తే ప్రయాణికులకు కాస్త ఊరట ఇచ్చినవారవుతారని పలువురు కోరుతున్నారు.

పరికరాలు బిగించారు... నిర్వహణ వదిలేశారు!

సంగారెడ్డి పట్టణంలోని ఉద్యాన పార్కు తీరిది

సంగారెడ్డిలో లెక్కలిలా..
- మొత్తం వార్డులు:38
- పట్టణ జనాభా: 1.20లక్షలు
- ఏర్పాటు చేసిన బహిరంగ వ్యాయమశాలలు: 18
- వాటికి ఖర్చు చేసింది: రూ.1.50లక్షలు.



రాజీవ్‌పార్కులో అస్తవ్యస్తంగా మారిన టైల్స్

న్యూస్‌టుడే, పోతిరెడ్డిపల్లి(సంగారెడ్డి అర్బన్ సంగారెడ్డి మున్సిపాలిటీ): పట్టణ ప్రజలకు చక్కటి ఆరోగ్యం, ఆహ్లాదం కల్పించాలన్న ఉద్దేశంతో బహిరంగ వ్యాయామ శాలలు (ఓపెన్ జిమ్)లను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పట్టణ ప్రగతిలో భాగంగా పలు కాలనీలోని జిమ్‌లలో రూ.లక్షల వ్యయం చేసి సౌకర్యాలు కల్పించారు. ఆర్భాటంగా ఏర్పాటు చేసిన తర్వాత వీటిపై పర్యవేక్షణ కొరవడింది. పట్టణంలోని పలు కాలనీల్లో పరికరాలు తుప్పు పట్టి... ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తున్నాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుంది. పరికరాలు మరమ్మతులకు గురయ్యాయి. పట్టణ ప్రజల ఆరోగ్య పట్టణ లక్ష్యం నెరవేరకపోగా.. ఆహ్లాదం కరవైంది. ఈ నేపథ్యంలో సంగారెడ్డి పట్టణంలోని పలు ఉద్యాన పార్కుల్లో ఏర్పాట్లు చేసిన బహిరంగ వ్యాయామ శాలల నిరుపయోగంపై 'న్యూస్‌టుడే' కథనం.

పట్టణంలోని.. 18వార్డుల్లో..

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పురపాలికలో 38 వార్డులు ఉన్నాయి. పట్టణ ప్రగతి నిధులతో 18 వార్డుల్లో బహిరంగ వ్యాయామ శాలలను ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ లేకపోవడంతో పరికరాలు, టైల్స్ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. పలువురు పరికరాలను చోరీ చేశారు. రాజీవ్ పార్కులో రూ.30 లక్షలతో నిర్మించిన జిమ్‌లో పూర్తిగా పాడయ్యాయి. మ్యాట్ లేచిపోయింది. కొన్ని పరికరాలు విరిగిపోవడంతో పక్కన పడేశారు. మరో ఐదు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. మహబూబ్‌సాగర్ చెరువుకట్టపై జిమ్‌లో కొన్ని మరమ్మతులకు లోనయ్యాయి. చాలా కాలనీల్లో ఇదే పరిస్థితి నెలకొన్నా.. వీటిని పట్టించుకునే వారే లేరు. దీంతో పట్టణవాసుల ఉదయం, సాయంత్రం నడకతోపాటు వ్యాయామ లక్ష్యం నేరవేరడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

మరమ్మతులు చేయిస్తాం ఇంతియాజ్ అహ్మద్, పురపాలక డీఈఈ

పట్టణంలోని బహిరంగ వ్యాయామ శాలలను త్వరలో పరిశీలించి వాటి బాగుకు అంచనాలు రూపొందిస్తాం. తగిన మరమ్మతులు చేయించి మళ్లీ వినియోగంలోకి వచ్చేలా కృషి చేస్తా. కాలనీవాసులే పరికరాల పరిరక్షణకు చొరవ తీసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. వీటిని ప్రజల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేశాం. కనుక స్థానిక యువకులు రక్షణ చర్యలు చేపట్టాలి.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఫోన్ చేయాల్సిన నంబర్లు (10AM TO 1 PM)
సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363
నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ టౌన్ 8008573250
అందోలు 8008573241, జిన్నారం 8008573231

? అందోలు గ్రామంలోని చెరువు పక్కన నిర్మించిన బతుకమ్మ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన హైమాస్టు దీపాలు సగానికి పైగా వెలుగడం లేదు. ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. **-శ్రీశైలం, అందోలు.**

✓ వెలగని దీపాలు తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తాం.
-తిరుపతి, కమిషనర్, అందోలు- జోగిపేట.

? అందోలు గ్రామ సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్తు తీగలపై చెట్ల కొమ్మలు పడ్డాయి. వాటి వల్ల భవిష్యత్తులో తీగలు తెగిపోయే ప్రమాదం ఉంది. **-రాజు, అందోలు.**

✓ విద్యుత్తు తీగల పైనుంచి ఉన్న కొమ్మలు తొలగించి భవిష్యత్తులోనూ ఇలా జరగకుండా చర్యలు తీసుకుంటాం.
-శ్రీనివాస్, ఏఈ విద్యుతు శాఖ అందోలు.

45 ఏళ్లనాటి స్థలాలపై పోలీసులు సహకరించాలి

రామచంద్రాపురం రూరల్: చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ 45 ఏళ్ల కిందట కొనుగోలు చేసిన స్థలాలు ఆక్రమించడానికి కబ్జాదారులు మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి కొల్లూరు గ్రామం లక్ష్మీపురం ప్లాట్ ఓనర్స్ సంక్షేమ సంఘం ప్రతినిధులు వాపోయారు. ఈ మేరకు ఆదివారం కొల్లూరు సీఐ రవీందర్‌కు కబ్జాదారులపై ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పెళ్లిళ్లు చేద్దామని కొనుగోలు చేసిన ఇంటి స్థలాలను కబ్జాదారులు వివాదాస్పదంగా మార్చారని చెప్పారు. తాము 1984లో 172 నుంచి 13 రకాల సర్వే నంబర్లలో వేసిన లేఔట్‌లో 1300 మంది కొనుగోలు చేశారని లక్ష్మీపురం ప్లాట్ ఓనర్స్ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్‌రెడ్డి, మల్లేష్, నిరంజన్ మూర్తి, బసవయ్య, సత్తయ్య, యూనస్, సురేందర్, అనురాధ, గిరిజలు పేర్కొన్నారు.



ఖేడ్: నిరసనలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తదితరులు



జోగిపేట: రాస్తారోకో చేస్తున్న నాయకులు

భారాస నిరసన పథం

ఎన్నికల హామీలను విస్మరించడంతో పాటు రైతుబంధు సాయం అందించక పోవడాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారాస నాయకులు నిరసనలు, ధర్నా, రాస్తారోకోలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. రైతుభరోసా డబ్బులను వెంటనే ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. పలు ప్రాంతాల్లో ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. - న్యూస్‌టుడే బృందం.



కంది జాతీయ రహదారిపై నినాదాలు చేస్తున్న నాయకులు



జిన్నారంలో...

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు



మారేపల్లి: అప్పటి గురువులతో...

కొండాపూర్, న్యూస్‌టుడే: కొండాపూర్ మండలం మారేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995-1996లో పదో తరగతి చదివిన విద్యార్థులతోపాటు తెర్పోల్ ఉన్నత పాఠశాలలో 1992-1993 పదో తరగతి చదివిన విద్యార్థులు వేర్వేరుగా ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను పూలమాల, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అందరు కలసి సహపంక్తి భోజనాలు చేసి ఆటపాటలతో సందడి గడిపారు.


జహీరాబాద్: పట్టణంలోని ఎం.ఆర్.హెచ్.ఎస్ పాఠశాలలో 1980-81 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. చిన్ననాటి అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఐ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ నరోత్తం, విద్యార్థి సంఘం నాయకులు నాగభూషణం, మాణిక్‌రెడ్డి పాల్గొన్నారు.

'నిరసన దీక్షకు తరలిరావాలి'

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: దళితుల్లో అత్యంత వెనకబడిన ఉప కులాల సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌లో సోమవారం చేపడుతున్న నిరసన దీక్షకు దాసరి వర్గానికి చెందిన వారు తరలిరావాలని ఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు టేకుమట్ల గణేష్ ఆదివారం పిలుపునిచ్చారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

నారాయణఖేడ్, కల్హేర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కంగ్టికి చెందిన కులకర్ణి శ్రీనివాస్‌రావుకు దవాఖానా ఖర్చుల నిమిత్తం రూ.60 వేలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కును ఆదివారం నారాయణఖేడ్ భారాస కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందజేశారు. రాంచందర్ తండా, వంగ్దాల్ మాజీ సర్పంచులు రాసింగ్, నాయక్, నమ్మిమేటకు చెందిన బొబ్బి, బేతయ్య ఆదివారం ఖేడ్ భారాస కార్యాలయంలో భూపాల్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ● కాంగ్రెస్‌కు చెందిన కిషన్‌నాయక్‌తండా మాజీ ఉప సర్పంచి లక్ష్మన్ ...



ఖానాపూర్(కే)లో పత్రాలు ఇస్తున్న భూపాల్‌రెడ్డి

● కల్హేర్ మండలం గోపాల్‌పేటకు చెందిన ఎండీ. ఇస్మాయిల్‌కు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.20 వేల చెక్కును ఖానాపూర్(కే)లో మాజీ ఎమ్మెల్యే ఆమె భర్త ఇమామ్‌కు అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు రాంసింగ్, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు అలీ, గోపాల్‌రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

22 నుంచి ఉర్సు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి పట్టణ శివారులోని ఇర్ఫాని దర్గా ఉత్సవాలు ఈనెల 22 నుంచి ప్రారంభమవుతాయని దర్గా పీఠాధిపతి అహ్మద్ బీన్ ఉమర్ పేర్కొన్నారు. గంధం ఊరేగింపు, అఖిల భారత కవి సమ్మేళనం తదితర కార్యక్రమాలకు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అసంపూర్తి పనులు... తప్పని నిరీక్షణ!



సంగారెడ్డి మండలం హన్మాన్‌నగర్ గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రెండేళ్ల కిందట రూ.20 లక్షలు మంజూరైనా పనులు మాత్రం స్లాబ్ వరకే పూర్తయ్యాయి. కిటికీలు, తలుపులు, ఫ్లోరింగ్, విద్యుత్తు, రంగులు తదితర పనులు మిగిలిపోయాయి. ఈ విషయంపై పీఆర్ డిప్యూటీ ఈఈ దీపక్‌ను 'న్యూస్‌టుడే' ప్రతినిధి వివరణ కోరగా... అదనపు నిధులు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయన్నారు.
- న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్

బావిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సదాశివపేట, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని మాడిశెట్టి రాచయ్య బావిలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నామని సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్ తెలిపారు. మృతదేహం ఉబ్బిపోయిందని, మూడు రోజుల క్రితమే మరణించి ఉంటాడని భావిస్తున్నట్లు వెల్లడించారు. ఇటీవల బావిలో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. మృతుడు ఇనుప చువ్వలను తీసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో పడి మరణించి ఉండవచ్చన్నారు. మృతుడి చొక్కాపై తాజ్ టైలర్ ఉందన్నారు. పూర్తి వివరాలకు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

కంకర వేశారు.. బీటీ మరిచారు!



ప్రమాదకరంగా మారిన కంకర

న్యూస్‌టుడే, నారాయణఖేడ్ టౌన్, జహీరాబాద్ అర్బన్: తెలంగాణ- కర్ణాటక రాష్ట్రాల రవాణాను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రోడ్డుకు రూ.2.45 కోట్లు మంజూరు చేసింది. దశాబ్దాల కల నెరవేరబోతుందని ఆ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కాని గుత్తేదారు సుమారు మూడు కిలో మీటర్‌కుపైగా రోడ్డుపై కంకర వేసి వదిలేయడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు. కురుస్తున్న వర్షాలకు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వంతెన నిర్మాణం చేపట్టలేదు. ఈ రోడ్డు కంటే ముందున్న మట్టి దారే బాగుండేదని ప్రజలు వాపోతున్నారు.

ఇదీ సంగతి: నాగల్‌గిద్ద మండలం ఇరక్‌పల్లి నుంచి వాలు నాయక్‌తండా, ఉమ్లానాయక్‌తండాల మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు మూడు కిలోమీటర్‌కు పైగా మట్టి దారి ఉండేది. రవాణా మెరుగుదలకు ప్రభుత్వం ఏడాది కిందట నిధులు మంజూరు చేయగా... పనులు కూడా వెంటనే మొదలై ఆగిపోయాయి. దారిలో పరిచిన కంకరపై ద్విచక్ర వాహనదారులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. కనీసం రూలర్ కూడా తిప్పలేదు. అధికారులకు, నాయకులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

మొదలెట్టని వంతెన..!

ఈ రోడ్డుకు వాలునాయక్‌తండా- ఉమ్లానాయక్‌తండాల మధ్య వాగుపై రాకపోకల నిమిత్తం వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ పనులకు కనీసం పునాది కూడా తీయలేదు. వాగులోని నీటి ఉద్ధృతి వల్ల వాహనదారులు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. నాణ్యతలేని పనులు చేసి అర్ధాంతరంగా వదిలిపెట్టడంతో ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు, వంతెన పనులు వెంటనే చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

గుత్తేదారుతో మాట్లాడి చేయిస్తాం

రోడ్డు పనులు నిలిచిపోయిన మాట వాస్తవమే. గుత్తేదారుతో మాట్లాడి మళ్లీ పనులు ప్రారంభించి పూర్తిచేయిస్తాం. వాగుపై వంతెన నిర్మాణానికి తగు చర్యలు తీసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. - సత్యానందం, డిప్యూటీ ఈఈ.



వంతెన నిర్మించాల్సింది ఇక్కడే

నాణ్యమైన భోజనం అందించాలి

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు సీహెచ్. అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖేడ్‌లో నిర్వహించిన ఆ సంఘ డివిజన్‌స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని వసతి గృహాల్లో మెనూ ప్రకారం భోజనాలు, అల్పాహారం, పండ్లు, గుడ్లు, పాలు, చికెన్ ఇవ్వడం లేదన్నారు. ఆ సంఘ డివిజన్ నాయకులు రాజు, ప్రవీణ్, నిఖిల్, రోహిత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

మనూరు, న్యూస్‌టుడే: మనూరు మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన విజయ్, షాంసన్‌లు ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంతో గ్రామస్థులు వారిని ఆదివారం సన్మానించారు. టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బాబురావు, ఉపాధ్యాయులు గోవిందరావు, మారుతి, యాదయ్య, రవికుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

'పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తాం'

గుమ్మడిదల: పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామని గుమ్మడిదల భారాస అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయనతోపాటు ఉపాధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నరహరిలను సన్మానించిన సందర్భంగా మాట్లాడారు. పార్టీ సీనియర్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సాస్ జిల్లా ఉపాధ్యక్షుడికి సత్కారం

జిన్నారం, న్యూస్‌టుడే: గడ్డపోతారానికి చెందిన 'శ్రీ అయ్యప్ప సేవా సమాజం' జిల్లా ఉపాధ్యక్షుడు ఎంపీ శివశంకర్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఉప్పల్‌లో జరిగిన గురుస్వాములు సన్మాన కార్యక్రమంలో మహాశాస్త్ర సేవా సమాజం ట్రస్టు తరఫున గురుస్వాములను సత్కరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సంగారెడ్డి అర్బన్(పోతిరెడ్డిపల్లి), న్యూస్‌టుడే: తనను ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపిస్తే సమస్యల పరిష్కరిస్తానని కృషి చేస్తానని పీఆర్‌టీయూ టీఎస్ బలపరిచిన అభ్యర్థి వి.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సంగారెడ్డి పట్టణ పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మాణయ్య, ప్రధాన కార్యదర్శి ప్రభు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాయం

జిన్నారం: రెండు నెలల కిందట సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేటకు చెందిన మధు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన జ్ఞాపకార్థం తల్లిదండ్రులు లక్ష్మి-నర్సింలు ఆదివారం విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకట్‌నారాయణ, వైస్ ప్రిన్సిపల్ వెంకటయ్య పాల్గొన్నారు.

కల్హేర్- పిట్లం రోడ్డుకు మహర్దశ



అభివృద్ధి చేయనున్న కల్హేర్- పిట్లం దారి

కల్హేర్, న్యూస్‌టుడే: రెండు జిల్లాలను అనుసంధానం చేసే రోడ్డుకు ఒకవైపు రోడ్డు, వంతేన పూర్తికాగా మరోవైపు మట్టిరోడ్డు అసంపూర్తిగా మిగలడంతో రాకపోకడలకు ఇబ్బందిగా మారింది. ఇటీవల పంచాయతీ రాజ్‌శాఖ గ్రామీణాభివృద్ధి ప్రభుత్వ కార్యదర్శి లోకేష్‌కుమార్ 2.78 కిలోమీటర్ల(సంగారెడ్డి జిల్లా సరిహద్దు వరకు) రోడ్డు నిర్మాణానికి రూ.2.78 కోట్లు మంజూరు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పూర్తయితే సంగారెడ్డి- కామారెడ్డి జిల్లాల సరిహద్దు గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుంది. 2007-08లో రాజీవ్ పల్లెబాట కార్యక్రమం కింద కల్హేర్ నుంచి కామారెడ్డి జిల్లా సరిహద్దు వరకు రోడ్డు మహారాజు వాగుపై వంతెనను రూ.1.57 కోట్లతో నిర్మించారు. వంతెన నుంచి పిట్లంవరకు ఉన్న రెండు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ప్రజాప్రతినిధులు కృషిచేసినా ఫలించలేదు. చివరికి ఇటీవల ప్రజాప్రతినిధులు, అధికారులు కృషిచేసి నిధులు మంజూరు చేయించారు. ఇందుకు కృషి చేసిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్‌శేట్కార్, జుకల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుకు కల్హేర్ మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

మారుమోగిన హన్‌మాన్ నామస్మరణ



రాయికోడ్‌లో కలశాల ఊరేగింపు

రాయికోడ్, న్యూస్‌టుడే: జై హన్‌మాన్.. శ్రీహన్‌మాన్ అంటూ రాయికోడ్ గ్రామం హన్‌మాన్ నామస్మరణతో మారుమోగింది. ఆదివారం రాయికోడ్‌లోని హన్‌మాన్ దేవాలయం పునఃప్రారంభం కార్యక్రమంలో భాగంగా మహిళలు కలశాల ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. భక్తుల కొరకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా దుర్గమ్మతల్లి ఉత్సవాలు



బొంతపల్లిలో భక్తుల ప్రదక్షిణ

బొంతపల్లి(గుమ్మడిదల), న్యూస్‌టుడే: బొంతపల్లిలో ఆదివారం దుర్గమ్మ తల్లి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం దుర్గమ్మ తల్లికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కావలి శంకర్‌యాదవ్, సభ్యుల పర్యవేక్షణలో ఉత్సవాలు సాగాయి. జోగిని అమ్మవారి ఊరేగింపుతో ఉత్సవాలు ఆరంభమయ్యాయి. పోతరాజు విన్యాసల మధ్య మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పిల్లల చదువుపై పర్యవేక్షణ అవసరం

రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో ఉంటూ చదువుతున్న పిల్లల చదువులపై తల్లిదండ్రులు పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్ పుష్ప అన్నారు. ఈ మేరకు ఆదివారం రామచంద్రాపురం బీసీ బాలికల వసతి గృహంలో బాలికలకు దుప్పట్లు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లలు చదువుకుంటూ వసతి గృహాల్లో నివాసాలు ఉంటున్నారని తెలిపారు.

రేపు పీహెచ్‌సీలో రక్తదాన శిబిరం

మనూరు, న్యూస్‌టుడే: మనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఈనెల 22న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సామాజికవేత్త, రక్తదాత ఓంప్రకాష్ ఆదివారం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా కుంటలోకి రసాయన వ్యర్థాలు..



ఆసానికుంట అంటే కాలుష్య, రసాయన జలాల నిలువకు కేంద్రం.! అయితే ఇటీవల కుంటలోకి వస్తున్న కలుషిత జలం ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అటుగా వెళ్లిన వారికి కళ్ల మంటలతోపాటు తుమ్ములు, ఘాటు వాసనలు వస్తున్నాయని వాపోతున్నారు. విషయం ఏమిటంటే గతంలో మాదిరి కుంటను కాలుష్య జలాలతో నిండుగా కనిపించకుండా ఎప్పటికప్పుడు బయటకు వెళ్లేలా చేశారు. ఇందుకు కారణం అధికారులు, పర్యావరణవేత్తలు వచ్చినపుడు కాలుష్య జలాల ప్రభావం ఉందని గుర్తించటానికి వీలు లేకుండా చేయడమే. అయినా ఘాటు వాసనలు మాత్రం తగ్గటం లేదు. సమస్యను పీసీబీ, రెవెన్యూ శాఖల అధికారులు గుర్తించాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, జిన్నారం.

తీగల వెనక.. ప్రమాదం!



అందోలు గ్రామ శివారులోని 161 జాతీయ రహదారి పక్క విద్యుతు స్తంభాలతోపాటు వైర్లకు అడవిజాతి తీగలు పాకాయి. ఇది చిట్టడవిని తలపించేలా ఉంది. ఈ తీగల మాటున ఎర్తింగ్ వైర్లు ఉన్నాయి. వాటికి పశువులు తాకినా ప్రమాదం జరిగే అవకాశాలున్నాయి. వెంటనే స్తంభాలకు చుట్టుకున్న తీగలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, జోగిపేట.

పశువుల తరలింపుపై ఫిర్యాదు

జహీరాబాద్: సంతలు, శివార్లలోని పశు వధశాలకు జీవాల తరలింపులో నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రాములు ఆదివారం జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. చిన్న వాహనాల్లో ఎక్కువ సంఖ్యలో పశువులను తరలిస్తుండటంతో రోడ్డు వెంట వెళ్లే ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని ఆయన వాపోయారు. దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.